క్లుప్తంగా

ఘనంగా ధ్వజారోహణం

రామసముద్రం : మండల కేంద్రం దిగువపేటలో వెలసిన శ్రీ ప్రసన్న పార్వతిసమేత శ్రీ చంద్రశేఖరస్వామి బ్రహోత్సవాలలో భాగంగా బుధవారం ఘనంగా ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహించారు. వేదపండితులు వృషభయాగం, దిక్పాలక ఆవాహము, ఉత్సవము, కళశారాధన, హోమాలు చేశారు. అర్చకులు బాలస్వామి, రవి స్వామిలు స్వామివారికి రుద్రాభిషేకాలు, విశేష అలంకరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. అధికసంఖ్యలో భక్తులు వచ్చి మొక్కులు చెల్లించారు.

ప్రత్యేక పూజలు

పెద్దమండ్యం : మండలంలోని పాపేపల్లెలో కుషావతీ నది ఒడ్డున ఏకశిల గుట్టపై వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ధ్వజారోహణం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం, తీర్థ ప్రసాదాలతో ఉభయదారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ధ్వజారోహణం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వేదపండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పగలు గ్రామోత్సవం, రాత్రి హనుమంతవాహనంపై స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవమూర్తులను పురవీధులలో ఊరేగింపు నిర్వహించారు.

ఘనంగా విశ్వక్సేన ఆరాధన



హోమాలు నిర్వహిస్తున్న వేదపండితులు

మదనపల్లె సిటీ : స్థానిక ప్రసన్న వెంకటరమణ స్వామి కళ్యాణోత్సాల్లో భాగంగా బుధవారం విశ్వక్సేన ఆరాధన, హోమాలను ఘనంగా నిర్వహించారు. వేదపండితులు వేదమంత్రోచ్చారణలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఆవరణంలో ప్రధాన అర్చకులు గోవర్ధన్‌భట్టార్ పరివార హోమలు చేశారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ బింగి పాండు, మాజీ సభ్యులు ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గురువారం స్వామి కళ్యాణోత్సవం, సరస్వతీ పూజలు నిర్వహిస్తామని పాండు తెలిపారు.సాయంత్రం పౌర్ణమి పురస్కరించుకుని స్వామి గరుడ వాహనంపై ఊరేగింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. భక్తులు కళ్యాణోత్సవం, అక్షరాభ్యాస కార్యక్రమాలకు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించాలన్నారు.

పక్కాగా సీసీపీ కార్యక్రమం అమలు



గర్భిణులనుంచి వివరాలు తెలుసుకుంటున్న సంధ్య

బి.కొత్తకోట : గర్భిణులకు వారి ఆరోగ్యం, పౌష్టికాహారంపై అమలు చేస్తున్న సీసీపీ కార్యక్రమం పక్కాగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని కార్యక్రమ పర్యవేక్షక జిల్లా సలహాదారు డాక్టర్ సంధ్య అన్నారు. బుధవారం ఆమె స్థానిక సీహెచ్‌సీని తనిఖీ చేశారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్‌కుమార్, గైనకాలజిస్టు డాక్టర్ హాసీనా బేగం, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎలా అమలు చేస్తున్నారన్న దానిపై సమీక్షించారు. తర్వాత ఆస్పత్రిలోని గర్భిణుల వద్దకే వెళ్లి సీసీపీ లక్ష్యం, వైద్యులు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఆరోగ్యంపై సలహాలు, సూచనలు ఇస్తున్నారని, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారని గర్భిణులు తెలిపారు. ప్రతి ఒక్కరికి అందిస్తున్న వైద్య సహాయం, అవగాహన కార్యక్రమంపై ఆమె సంతృప్తి వ్యక్తం చేస్తూ వైద్యులను అభినందించారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ములకలచెరువు : మండలంలోని ఎస్సీ, ఎస్టీ కులాల సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని దళిత నాయకులు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం తహసీల్దార్ ప్రదీప్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు. ఆలయాల్లోకి దళితులను రానివ్వకుండా కుల వివక్ష చూపుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రైవేటు పాఠశాలల్లో దళిత విద్యార్థులకు రాయితీ అందడం లేదన్నారు. స్మశానం కోసం స్థలం కేటాయించాలని బురకాయలకోట ఎస్సీ కాలనీ వాసులు అధికారులకు తెలిపారు. దళితుల నుంచి అధికారులకు ఫిర్యాదులు వస్తే వెంటనే పరిష్కరించాలని కోరారు. సమావేశంలో దళిత నాయకులు ప్రతాప్, సుధాకర్, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మామిడి రైతులకు శిక్షణ

కలికిరి : స్థానిక కేవీకే కార్యాలయంలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మామిడి సస్యరక్షణ చర్యలపై గురువారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉద్యానశాఖ అధికారి సుకుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మామిడి రైతులు హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కోట్లాది ప్రజల గొంతుక వైఎస్సార్ సీపీ

- ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
- మళ్లీ అధికారంలోకి వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే
- ప్రజలను నమ్మించి మోసం చేసిన కూటమి ప్రభుత్వం
- సమన్వయకర్త నిసార్‌అహ్మద్



మదనపల్లెలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసిన సమన్వయకర్త నిసార్‌అహ్మద్, నాయకులు తదితరులు



తంబళ్లపల్లెలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి



రామసముద్రంలో వైఎస్సార్ సీపీ నాయకులు



వాల్మీకిపురంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే చింతల

మదనపల్లె : మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయసాధన లక్ష్యంగా ఏర్పాటై, విలువలు, విశ్వసనీయతతో ప్రజలకు దగ్గరై, రాష్ట్రంలోని కోట్లాది ప్రజల గొంతుకగా వైఎస్సార్ సీపీ నిలిచిందని నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. వైఎస్సార్ సీపీ 14 వసంతాలు పూర్తిచేసుకుని 15వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం ఎదుట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి జెండా ఎగురవేశారు. ముందుగా మహానేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిసార్ అహ్మద్ మాట్లాడుతూ...ప్రతిపక్షమైనా, అధికారపక్షమైనా ప్రజల అభిమతమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ పనిచేస్తుందన్నారు. ప్రజల కష్టాల నుంచి వైఎస్సార్ సీపీ పుట్టిందన్నారు. అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 95 శాతం అమలు చేశామన్నారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు వెన్నుదన్నుగా నిలవడమే కాకుండా, గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల గుమ్మం వద్దకే ప్రభుత్వాన్ని తీసుకెళ్లిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదును జమచేస్తూ విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సాధికారతకు పెద్దపీట వేశారన్నారు. అబద్ధపు హామీలతో ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 9నెలలకే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకుందన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా, ఎవరిని కదిలించినా జగనన్న సంక్షేమ పాలన గురించి మాట్లాడుతున్నారని, చంద్రబాబును నమ్మినందుకు నట్టేట ముంచారని, వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా జగనన్నను గెలిపించుకుంటామని చెపుతున్నారన్నారు. నాయకులు, కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదని, రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 14 ఏళ్ల ప్రస్థానంలో వైఎస్సార్ సీపీ ఎన్నో ఒడిదొడుకులు చూసిందని, రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవడం తథ్యమన్నారు. మున్సిపల్ చైర్పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్ జింకాచలపతి, జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దండుకరుణాకర్‌రెడ్డి, డి.హార్షవర్ధన్‌రెడ్డి, బాల గంగాధరరెడ్డి, మస్తాన్‌రెడ్డి, ఎస్.ఏ.కరీముల్లా, గార్ల చంద్రమౌళి, వీఎస్ఎస్.రెడ్డి, జన్నే రాజేంద్రనాయుడు, నాగరాజరెడ్డి, అనిల్‌రెడ్డి, నూర్‌మొహియుద్దీన్‌ఖాన్, ముజీబ్, ఆర్టీఏ నూర్, మాధవరెడ్డి, కౌన్సిలర్లు ఈశ్వర్ నాయక్, రామిశెట్టిశివయ్య, పూజారిచరణ్, కొత్తపల్లె మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లెలో..

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొమ్మేపల్లె శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో నిమ్మనపల్లె బస్టాండ్‌లో వైఎస్సార్ సీపీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మహానేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు.జెండా ఎగురవేసి, కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డిశేఖర్‌రెడ్డి, ఉషారాణి, రామ్మోహన్‌రెడ్డి, యర్రయ్య, గడ్డంనర్సింహారెడ్డి, రెడ్డిభాస్కర్, రామారావు, యోగానందరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ వైస్సాఆర్ సీపీదే

తంబళ్లపల్లె : భవిష్యత్తు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదేనని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. నియోజకవర్గ కేంద్రంలో బుధవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సర్కిల్‌లోని మహానేత వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే పాలాభిషేకం చేసి నివాళులు అర్పించారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కేక్ కట్ చే సి సంబరాలు చేసుకున్నారు. అనంతరం జిల్లా కేంద్రమైన రాయచోటిలో తలపెట్టిన యువతపోరు కార్యక్రమానికి భారీ వాహనాల్లో ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ చౌడేశ్వర్, వైఎస్ ఎంపీపీ కరీమ్, కో ఆప్షన్ సభ్యులు జమాల్‌బాషా, నాయకులు కోటిరెడ్డి, బాలకృష్ణారెడ్డి, పద్మనాభరెడ్డి, తాళ్ల చంద్రశేఖర్, రాజశేఖర్‌రెడ్డి, శివారెడ్డి, కిషోర్‌రెడ్డి, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రంలో..

రామసముద్రం : మండల కేంద్రంలో బుధవారం వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. జై జగన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. రాబోయే కాలంలో తిరిగి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ కుసుమకుమారి, మండల కన్వీనర్ కేశవరెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ గెవన్న, జిల్లా ఉపాధ్యక్షులు, జెడ్పీటీసీ సీహెచ్.రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ రమణారెడ్డి, భాస్కర్‌గౌడు, దొడ్డిపల్లె ఆనంద, బాలాజీ, సుబ్బారెడ్డి, ప్రకాష్, భాస్కర, తిమ్మయ్య, శివదర్శన్, నారాయణస్వామి, ఉదయ్‌శంకర్‌రెడ్డి, రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో..

కలికిరి(వాల్మీకిపురం) : పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వాల్మీకిపురంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సంబరాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, పేదల అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భవించిందని గుర్తుచేశారు. సంక్షేమ పాలన వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమవుతుందన్నారు. అనంతరం కేకు కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతల శివానందరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ పులి శివకుమార్‌రెడ్డి, ఉప సర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి, నాయకులు రఘు, గణేష్, మదనమోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, మహేష్‌రెడ్డి, ఇర్ఫాన్, సైఫుల్లా, చికెన్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుమల్లమ్మ మాన్యంపై విచారణ

- ఆస్తులు గట్టువి..పేరు హార్సిలీహిల్స్‌ది
- పరిశీలించిన జిల్లా అధికారి విశ్వనాథ్



మాన్యం భూములు పరిశీలిస్తున్న విశ్వనాథ్

బి.కొత్తకోట : మండలంలోని ఏనుగుమల్లమ్మ ఆలయం పేరిట నమోదైన మాన్యం భూములపై దేవదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్ బుధవారం విచారణ జరిపారు. పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్, గట్టులో రెండుచోట్ల ఏనుగుమల్లమ్మ ఆలయాలు ఉన్నాయి. ఈ ఆలయం పేరుతో గట్టు గ్రామ పరిధిలో 13 ఎకరాల మాన్యం భూములు ఉండగా ఆదాయం వస్తోంది. ఈ భూములన్ని గట్టులోని ఏనుగుమల్లమ్మ ఆలయంకు చెందినట్లుగా పట్టదారు పాసుపుస్తకాలు జారీ అయినప్పటికి భూములు హార్సిలీహిల్స్‌పై వెలసిన ఏనుగుమల్లమ్మ ఆలయం, హార్సిలీహిల్స్ పేరిట రికార్డుల్లో నమోదై ఉంది. దీనితో హార్సిలీహిల్స్ ఆలయానికి మాన్యం భూములు, ఆదాయం వస్తున్నందున దీనికి వర్తిస్తున్న దీపధూప నైవేద్య పథకం అమలు నిలిపివేయాలని ఆ శాఖ తిరుపతి ఆర్‌జేసీ జిల్లా అధికారికి ఆదేశించారు. ఈ పరిణామంతో అసలు ఏ ఆలయానికి ఈ భూములు చెందుతాయి అన్న విషయాన్ని నిర్ధారించుకునేందుకు విశ్వనాథ్ గట్టు, హార్సిలీహిల్స్‌పై పర్యటించారు. తొలుత గట్టు గ్రామంలోని ఆలయాన్ని సందర్శించాక భూములున్న ప్రాంతాల్లో పర్యటించి పరిశీలించారు. పట్టదారు పాసుపుస్తకాలు, రికార్డులు పరిశీలించారు. కొండపై ఆలయంకు చేరుకుని పరిశీలనలు జరిపాక పూజారి నుంచి వివరాలు సేకరించారు. దీనిపై విశ్వనాథ్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలతో భూములను పరిశీలించామని చెప్పారు. భూములు గట్టు ఆలయానికికి చెందినవిగా తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఇంకా పూర్తి స్థాయిలో పరిశీలనలు, రికార్డులు, రెవెన్యూ అధికారులతో చర్చించాక తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు.

టూరిజం భవనంపైనా వివాదం :

దేవదాయశాఖ హార్సిలీహిల్స్‌పై టూరిజం భవనాలపై కొత్త వివాదానికి తెర తీసింది. దశాబ్దాలుగా పర్యాటకశాఖకు చెందిన, దాని పరిధిలోని గదులు ఇప్పుడు ఏనుగుమల్లమ్మ ఆలయ ప్రాంగణంలో ఉన్నందున తమ శాఖకు చెందినవని దేవదాయశాఖ వివాదాన్ని రేపింది. ఈ గదులను జిల్లా పర్యాటకశాఖ అధికారి నాగభూషణంతో కలిసి విశ్వనాథ్ పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు గదులు పర్యాటకశాఖకు చెందినవని నిర్ధారించగా సర్వే నిర్వహించి తేల్చాలని నిర్ణయించారు.

సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదాం



సారా నిర్మూలనపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజలు

పీలేరురూరల్ : సారా రహిత గ్రామాలుగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా ప్రజల్లో చైతన్యం నింపుతున్నట్లు రాయచోటి ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మండలంలోని గూడరేవుపల్లె పంచాయతీ మర్రిమాకులపల్లె తాండాలో నాటు సారా నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయాన మాట్లాడుతూ నాటుసారాకు బానిసై కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయన్నారు. ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నష్టపోతారని పేర్కొన్నారు. సారా తయారీ, విక్రయాలకు దూరంగా మంచిమార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐలు యుగంధర్, వెంకటసుబ్బారెడ్డి, ఎంపీడీవో శివశంకర్, డీటీ చంద్రశేఖర్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రాయితీపై వ్యవసాయ పరికరాలు

ఏడీఏ శివశంకర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ శివశంకర్

నిమ్మనపల్లె : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వ్యవసాయ పరికరాలు, యంత్రాలను 50 శాతం రాయితీతో అందిస్తోందని వ్యవసాయ శాఖ మదనపల్లి ఏడీఏ శివశంకర్ తెలిపారు. బుధవారం కొండయ్య గారి పల్లెలో వ్యవసాయ అధికారి మురళీమోహన్‌తో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు రాయితీ పరికరాల కోసం సంబంధిత రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అధిక దిగుబడులను సాధించడానికి వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారుల సూచనలు తప్పక పాటించాలన్నారు. పంట సాగు విధానం, క్రిమి సంహారక మందుల వాడకం, పంట దిగుబడి, మార్కెటింగ్‌లో మెలకువలపై అధికారులు ఎప్పటికప్పుడు తగు సూచనలు చేస్తున్నారన్నారు. పంట అధిక దిగుబడులకు తగినంత మోతాదులో మాత్రమే ఎరువులను ఉపయోగించాలని సూచించారు. పలు వ్యవసాయ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది శ్రీకాంత్, రాజశేఖర్, కుమార్ నాయక్, రైతులు పాల్గొన్నారు.

వినతుల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపాలి

జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్



తహసీల్దారు కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జేసీ ఆదర్శరాజేంద్రన్

కలికిరి : ప్రజల నుంచి వినతుల పరిష్కారంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది ప్రత్యేక చొరవ చూపాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అన్నారు. కలికిరి తహసీల్దారు కార్యాలయాన్ని ఆయన బుధవారం మధ్యాహ్నం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించిన రీ వెరిఫికేషన్ రికార్డులను పరిశీలించారు. వీటిని త్వరితగతిన ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పీజీఆర్ఎస్, రెవెన్యూ గ్రామసభలు, భూ రీ సర్వే అనంతరం రైతుల నుంచి వచ్చిన వినతులను పరిష్కరించాలన్నారు. వినతుల పరిష్కారానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. తహసీల్దారు మహేశ్వరిబాయ్, డీటీ నవీన్, మండల సర్వేయరు రెడ్డెప్ప, సీనియర్ అసిస్టెంట్ హుస్సేన్ పీరా, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

మాజీ సైనికులకు పన్ను మినహాయింపు ఇవ్వాలి



పన్ను మినహాయింపు ఇవ్వాలని ధర్నా చేస్తున్న మాజీ సైనికులు

మదనపల్లె : మున్సిపాలిటీలో మాజీ సైనికులకు ఇంటిపన్ను, కొళాయిపన్ను మినహాయింపు ఇవ్వాలని మదనపల్లె డివిజన్ మాజీ సైనిక సంఘం అధ్యక్షులు కంచర్ల శ్రీనివాసులు కోరారు. బుధవారం మున్సిపాలిటీ ఎదుట మాజీ సైనికులతో కలిసి మినహాయింపుపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మేనేజర్ రాంబాబు, మాజీ సైనికులతో మాట్లాడుతూ.. ఇంటిపన్ను కట్టాల్సిందిగా మాజీ సైనికులకు నోటీసులు ఇచ్చి ఉంటే, వారు నోటీసుతో పాటుగా 20 శాతం పన్ను మినహాయింపుకు సంబంధించి లెటర్‌ను కార్యాలయంలో అందించాలన్నారు. కొళాయిపన్నుకు సంబంధించి సైనిక ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసిన వారికి మాత్రమే 20 శాతం పన్ను మినహాయింపు ఉందని మాజీ సైనికులు మేనేజర్ దృష్టికి తేగా, దానికి సంబంధించిన జీఓ రద్దయిందన్నారు. మాజీ సైనికులకు సంబంధించిన ఇంటి, కొళాయిపన్ను మినహాయింపునకు సంబంధించి ఏవేని అనుమానాలు ఉంటే మున్సిపాలిటీలో సంప్రదించాల్సిందిగా తెలిపారు. కార్యక్రమంలో ఆర్వో విజయ్‌కుమార్, ఆర్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

బకాయిల వసూళ్లకు ఇంటింటికి అధికారులు



ఇంటింటికి బ్యాంకు రుణాలు చెల్లించాలని కోరుతున్న మేనేజర్, అధికారులు

బి.కొత్తకోట : స్థానిక సహకార బ్యాంకు నుంచి వివిధ రకాల రుణాలు పొందిన ఖాతాదారులు చెల్లించాల్సిన బకాయిల వసూళ్ల కోసం బుధవారం మేనేజర్ శివారెడ్డి బ్యాంకు అధికారుల బృందంతో ఇంటింటికి వెళ్లారు. ఖాతాదారుల వద్దకే వెళ్లి రుణాలు చెల్లించి సహకారించాలని విన్నవించారు. సకాలంలో రుణాలు చెల్లిస్తే అందరికి రుణాలు మంజూరు చేసి సహకారం అందించేందుకు వీలవుతుందని వివరించారు. పంట రుణాలకు వడ్డీ జమ చేసి రెన్యూవల్ చేయించుకోవాలని కోరారు. స్వల్ప, దీర్ఘకాలిన రుణాలు చెల్లించాల్సిన ఖాతాదారులు సహకరించి రుణాలు చెల్లించాలని కోరారు. అలాగే బ్యాంకు ద్వారా ఖాతాదారులకు అందిస్తున్న సేవలు, రుణాల మంజూరు, డిపాజిట్లపై ఆక్షణీయమైన వడ్డీ వివరాలు తెలియజేశారు.

ఖేలో భారత్‌లో విద్యార్థుల ప్రతిభ

మదనపల్లె : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఖేలోభారత్ క్రీడాపోటీల్లో జ్ఞానాంబిక విద్యార్థులు ప్రతిభ కనపరిచి పతకాలు సాధించినట్లు కరస్పాండెంట్ డాక్టర్. రాటకొండ గురుప్రసాద్ తెలిపారు. బుధవారం కళాశాలలో క్రీడాపోటీల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. అమ్మాయిల కబడ్డీ విభాగంలో 32.3 తేడాతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులపై గెలుపొందారన్నారు. పురుషుల కబడ్డీలో బీటీ కళాశాల విద్యార్థులపై 39.7 పాయింట్స్ తేడాతో మొదటిస్థానాన్ని, వాలీబాల్ పురుషుల విభాగంలో రెండోస్థానాన్ని కైవసం చేసుకున్నారన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఏబీవీపీ ఆధ్వర్యంలో మొమెంటోలు, మెడల్స్ ప్రదానం చేశారన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సురభి రమాదేవి, ఫిజికల్ డైరెక్టర్స్ శరత్‌కుమార్ నాయక్, జగదీష్ విద్యార్థులను అభినందించారు.

శేషవాహనంపై గట్టు వెంకటేశ్వరస్వామి



మండలంలోని చెంబకూరులో వెలసిన శ్రీ గట్టు వెంకటేశ్వర స్వామి బ్రహ్మరథోత్సవాలలో భాగంగా బుధవారం స్వామివారు శేషవాహనంపై వైభవంగా ఊరేగారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. – రామసముద్రం

15న సామాజిక తనిఖీ బహిరంగ సభ

కలికిరి : మండల పరిధిలో గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బహరంగ సమావేశం ఉదయం 10.30 గంటలకు స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భానుమూర్తిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే గ్రామాలలో క్షేత్ర స్థాయిలో పనులను తనిఖీ సిబ్బంది పరిశీలించి గ్రామసభలు నిర్వహించినట్లు తెలిపారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

పీలేరు : బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని సీడీపీఓ రాజమ అన్నారు. బుధవారం స్థానిక ట్రిబల్ వెల్ఫేర్ బాలికల గురుకుల విద్యార్థినులచే 2కే రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల విద్యను ప్రోత్సహించాలని కోరారు. బాలికల పరిశుభ్రత, ఆరోగ్యం, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలికల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శంకరమ్మ, స్వరూప, బారతి, శాంతి, అన్నపూర్ణ, స్వర్ణ, ఉమ, యశోదరాణి అక్కయ్య పాల్గొన్నారు.

వర్గీకరణ నివేదికను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ధరణికుమార్

పీలేరురూరల్ : మాలలకు అన్యాయం జరిగేలా రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమీషన్ వర్గీకరణ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తుమ్మల ధరణికుమార్ అన్నారు. బుధవారం నిర్వహించిన మాలమహానాడు సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 20 శాతం పైగా జనాభా కల్గిన మాలలకు కేవలం 7.5 రిజర్వేషన్ కేటాయించి విద్య, ఉద్యోగ రంగాల్లో అడ్డుకునేలా ఈ నివేదిక ఉందని తెలిపారు. దళితుల సామాజిక అభివృద్ధిని అడ్డుకునేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం కుట్ర చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు మల్లికార్జున, కొప్పుల వినయ్‌కుమార్, వై. కార్తీక్, నీలా మనోజ్‌కుమార్, ప్రభుదేవ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు వసూలు చేయండి



సూచనలిస్తున్న డీఎల్‌పీఓ నాగరాజు

పీలేరు : సకాలంలో పంచాయతీ పన్నులు వసూలు చేయాలని డీఎల్‌పీఓ నాగరాజు అన్నారు. బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో బిల్ కలెక్టర్లు, డేటాఎంట్రీ ఆపరేటర్లు, జూనియర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఇంటి పన్నులు, నీటి పన్నులు, పాత బకాయిలు గడువులోపు వసూలు చేయాలని ఆదేశించారు. పంచాయతీ అభివృద్ధికి అందరి సహకారం ఉండాలన్నారు. కార్యక్రమంలో ఈవో గురుమోహన్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

19న బహిరంగ వేలం

నిమ్మనపల్లె : మండల కేంద్రమైన నిమ్మనపల్లి గ్రామ పంచాయతీకి సంబంధించిన వారపు సంత, బస్టాండ్ గేటు, పంచాయతీ షాపింగ్ రూములకు మదనపల్లి డీఎల్పిఓ నాగరాజ ఆదేశాల మేరకు ఈనెల 19 తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి సంబంధించిన బహిరంగ వేలం ఉదయం 11 గంటలకు, వారపు సంత ఆవరణంలో ఎంపీడీఓ, ఈవోపీఆర్డి, స్థానిక సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. బస్టాండ్ గేటు రూ. 70 వేలు, వారపు సంత గేటు రూ. 2 లక్షలు , ఒక్కొక్క పంచాయతీ షాపింగ్ రూమ్ కు రూ. 20 వేలు నుంచి 40 వేలు రూపాయలను పాటదారులు ముందుగా డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. పంచాయతీకి బకాయిలు ఉన్నవారు వేలంలో పాల్గొనుటకు అనర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరింత సమాచారానికి 7013954635 పై నెంబర్ పై పంచాయతీ కార్యదర్శిని సంప్రదించాలని తెలిపారు.

మామిడి రైతులు జాగ్రత్తలు పాటించాలి



మామిడి రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పీలేరు : మామిడి పూత, పిందె దశలో ఉన్న నేపథ్యంలో రైతులు సరైన జాగ్రత్తలు పాటించాలని శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని కాకులారంపల్లె, బాలంవారిపల్లో పంచాయతీల్లో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మామిడి రైతులకు సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులల్లో తేనెమంచు పరుగు, తామర పురుగు, ఆంత్రక్నోస్ తెగులు ఆశించే ప్రమాదం ఉందన్నారు. తెగులు నివారణకు అధికారులు సూచించిన మందులు పిచికారి చేయాలని సూచించారు. ప్రభుత్వం సబ్సిడీతో ఇస్తున్న ఫ్రూట్ కవర్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫ్రూట్ కవర్లు కట్టడం వల్ల పండు ఈగ, మసిమంగు నుంచి కాయకు రక్షణ కల్పించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి సుకుమార్‌రెడ్డి, ఏవో రమాదేవి, ఆర్ఎస్‌కే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.